www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్
15 అక్టోబర్ 2026
సంపుటి:4 సంచిక: 280

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## అభివృద్ధిలో వివక్ష లేదు

- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి వివక్ష లేదు
- జీరో రిజిస్ట్రేషన్ ఛార్జీలతో పేదలకు ఇళ్లు
- బతుకమ్మ పండుగ నాటికి లబ్ధిదారులకు తాళాలు
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ టవర్స్
- పేదల సంక్షేమమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

02

పోచారంలో ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన



కురవిలో

బతుకమ్మ సంబురాలు

## అంబరాన్నంటాయి

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ మంత్రి
- బీఆర్ఎస్ నేతల సందడితో రెట్టింపైన ఉత్సాహం
- ఆటపాటలు, డీజే హోరుతో మారుమోగిన పండుగ ప్రాంగణం

07



ఫ్లైఓవర్ల కింద విద్యుత్

## సబ్ స్టేషన్లు

- సాధ్యాసాధ్యాల పరిశీలన లేకుండా ప్రతిపాదనలు
- ప్రజాభద్రతకు ప్రమాదం.. విద్యుత్ రంగ నిపుణులు
- ముషీరాబాద్ స్టీల్ బ్రిడ్జి కింద మోడల్ నిర్మాణంపై కసరత్తు
- మరో 8 చోట్ల కాంపాక్ట్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు రంగం సిద్ధం

03

హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఉస్మానియా ఆసుపత్రి పేరుకు పెద్దాసుపత్రి అయినా లోపల పరిస్థితులు పూర్తిగా దారుణంగా మారాయి. రోజువారీ వైద్యం కోసం వేలాది మంది రోగులు వస్తున్నప్పటికీ కనీస వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. చిన్న ఎక్స్ రే తీయాలన్నా యంత్రాలు పనిచేయక రోగులు తమ స్మార్ట్ ఫోన్లలో ఫొటోలు తీసుకుని వైద్యులకు పంపాల్సిన దుస్థితి నెలకొంది. మూలపడిన సీటీ స్కాన్ యంత్రాలు రోగుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 15 సంవత్సరాల క్రితం ఉన్న సౌకర్యాలు కూడా నేడు కరువయ్యాయి.

# ఉస్మానియా.. ఎందుకీ కష్టాలు!




### కనీస సౌకర్యాలు లేక రోగుల ఇబ్బందులు

- పనిచేయని ఎక్స్-రే, ఎంఆర్ఐ మెషీన్లు
- నిలిచిపోయిన ఓపెన్ హార్ట్ సర్జరీలు
- కొరవడిన మందులు, సర్జికల్ పరికరాలు
- పెండింగ్ బకాయిలతో సప్లయ్ నిలిపివేత
- రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్న వైద్యులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రూ.600 కోట్ల పెండింగ్ బకాయిలు ఉన్నట్లు సమాచారం. ఉస్మానియా ఆసుపత్రిలో కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి 18 రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు ఉన్నా గుండె జబ్బుతో వచ్చేవారికి స్టెంట్ వేసే నాథుడు లేడు. ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఏకంగా నాలుగేళ్లు దాటిపోవడం అక్కడి అత్యంత

మిగతా 2లో..

ఉచిత వైద్యం అందే ప్రభుత్వ ఆసుపత్రిపై నమ్మకం కోల్పోయి రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. డాక్టర్లే స్వయంగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టాల్సి వస్తోందంటే అక్కడి సమస్యల తీవ్రత ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, సప్లయర్లు మందుల సరఫరా నిలిపివేయడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి.

## పాలమూరుకు పట్టిన శని కాంగ్రెస్

- కర్ణాటక రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- సీఎం రేవంత్ రెడ్డికి సోయి లేదు
- కనీసం మంత్రులూ పరామర్శించిన పాపాన పోలేదు
- బీఆర్ఎస్ తరపున తక్షణ ఆర్థిక సాయం అందజేత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాలమూరుకు పట్టిన శని కాంగ్రెస్.. మళ్ళీ వలసలు రేవంత్ రెడ్డి వైఫల్యం అని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కర్ణాటక రోడ్డు ప్రమాద బాధిత దళిత కుటుంబాలను పరామర్శించిన హరీశ్‌రావు.. రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గద్వాల జిల్లాలోని ఇందువాసి గ్రామానికి చెందిన దళిత కూలీలు ఏసేపు, నాగన్న కుటుంబాలకు, క్షతగాత్రులకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ తరపున తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు, కాళ్లు చేతులు విరిగి నడుము ఫ్రాక్చర్ అయిన క్షతగాత్రులకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గద్వాల జిల్లా ఇందువాసి గ్రామంలో దాదాపు 40 దళిత కుటుంబాలు కూలి పనుల కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకకు వెళ్లాయి. అక్కడ యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి ఆస్పత్రిలో విషమంగా ఉంది. చాలామందికి కాళ్లు, చేతులు, నడుములు విరిగి

మిగతా 2లో..

## సీజేపీ మరో కొత్త ఆందోళన



- జెండా ఎగురవేసినందుకు సీజేపీ నేతల అరెస్ట్, నిరసన
- అక్టోబర్ 16న కన్నాట్ ప్లేస్‌లో 'తిరంగ మార్చ్'కు పిలుపు
- నిబంధనల ఉల్లంఘనతో సీజేపీ నేతలకు 5 రోజుల కస్టడీ
- సీజేపీకి అమెరికా నుంచి విదేశీ నిధులు వస్తున్నాయని ఆరోపణ
- దేశంలో అలజడి సృష్టించే కుట్ర జరుగుతోందని వెల్లడి
- జెండా వివాదం, నిధుల ఆరోపణలతో ఢిల్లీలో రాజకీయ వేడి

02

## పెట్టుబడులకు కేరాఫ్ తెలంగాణ



- ఎన్నికలప్పుడే రాజకీయాలు ముఖ్యమంత్రి రేవంత్
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణ
- దేశ జీడీపీలో 10శాతం వాటా లక్ష్యం
- ఓఆర్ఆర్ బయటకు కాలుష్య పరిశ్రమలు
- 'హిల్ట్ పాలసీ'తో పారిశ్రామికవేత్తలకు రాయితీలు
- మహిళలకు రూ. 61 వేల కోట్ల రుణాలు
- హైటెక్స్‌లో ఘనంగా 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్-2026

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ కంపెనీల్లో మనవాళ్లు ఉన్నత ఉద్యోగాలు చేస్తూ సర్వీస్ అందించడం వరకే పరిమితం కాకూడదని, సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి గ్లోబల్ స్థాయిలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా, తిరుగులేని 'ఇండస్ట్రీ హబ్'గా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రాన్ని మూడు ఆర్థిక విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే యువతకు, మహిళలకు ప్రభుత్వం పూర్తి భరోసాగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో 'సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల 'గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026'ను

మిగతా 3లో..

## మీరు మారరా..!

- పోస్టింగుల కోసం భారీగా ముడుపులు
- రెవెన్యూ శాఖలో విపరీతమైన అక్రమాలు
- ఏసీబీకి వరుసగా దొరుకుతున్న అధికారులు
- లంచాలు ఇస్తేనే ముందుకు కదులుతున్న ఫైళ్లు
- గ్రీవెన్స్ ఫిర్యాదులపై అధికారుల నిర్లక్ష్యం
- కార్యాలయాల్లో కొరవడిన పారదర్శకత




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశంలోనే రంగారెడ్డి జిల్లా ఖరీదైనదిగా పేరొందింది. జిల్లాలో ప్రభుత్వాధికారులు విధుల నిర్వహణకు రాష్ట్రవ్యాప్తంగా పోటీలు పడుతుంటారు. పోస్టింగులకు జోరుగా పైరవీలు చేస్తుంటారు. రూ. కోట్లలో ముడుపులు కూడా ముట్టజెపుతుంటారు. నచ్చిన చోట జాయిన్ అవుతుంటారు. ఆ తర్వాత ఏంటంటే.. అక్రమార్జనే ధ్యేయంగా పోటీ పడుతుంటారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగుల నుంచి మండల స్థాయి అధికారులు, సిబ్బంది వరకు విచ్చలవిడిగా అవినీతికి తెగబడుతుంటారు. చివరకు ఏసీబీ దాడుల్లో పట్టుబడినా కానీ అదరరు.. బెదరరు! జిల్లాలో ప్రభుత్వ భూములు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు, రెవెన్యూ వ్యవహారాలకు ఉన్న ప్రాధాన్యం

మిగతా 3లో..

22ఏ జాబితా

## పేరుతో దందా

సెక్షన్ 22ఏతో ప్లాట్లు, ఇండ్ల యజమానుల ఆందోళన

- నిషేధిత జాబితా నుంచి తొలగించే పేరుతో భారీ వసూళ్లు
- ప్లాట్‌కు రూ. 5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్న దళారులు
- తప్పనిసరిగా సుమోటోగా లిస్ట్ ప్రక్షాళన చేయాల్సిన ప్రభుత్వం
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న అధికారుల తీరు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో సెక్షన్ 22ఏ వల్ల ప్లాట్లు, ఇండ్ల యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇద్దరు ముగ్గురు దళారులు రంగంలోకి దిగి అధికారుల పేరిట రూ.లక్షలు గుంజేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా గజం ధర లక్షల్లో పలుకుతోంది. ఇలాంటి సమయంలో ఎప్పుడో 20, 30 ఏండ్ల క్రితం కొనుగోలు చేసిన ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడంపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. అసైన్డ్, ప్రభుత్వ ల్యాండ్, యూఎల్సీ అంటూ కొర్రీలు పెట్టి ఆటో లాక్ చేశారు. తాజాగా అక్రమ నిర్మాణాలను కూడా పీవోబీలో పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో ప్రజల్లో భయం మరింత పెరిగింది. అన్ని అనుమతులు తీసుకొని కట్టిన ఇండ్లు ఏ కేటగిరీ కిందకు వస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సేల్ డీడ్స్ ద్వారా కొనుగోలు చేసిన ఆధారాలు స్పష్టంగా ఉన్నప్పుడు ఇలాంటి నిషేధాలు విధించడం చట్టరీత్యా తప్పు. అధికారుల అత్యుత్సాహం కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాజకీయంగా తీవ్ర ఇరుకాటంలో పడింది. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ సమస్య

మిగతా 3లో..

కాంగ్రెస్ వచ్చింది..

## కరెంట్ పోయింది



- కాంగ్రెస్ అవినీతితో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని కేటీఆర్ విమర్శ
- బొగ్గు ఉత్పత్తి 70 నుంచి 58 మిలియన్ టన్నులకు తగ్గింపు
- సైట్ విజిట్, నైనీ బ్లాక్ పేరిట భారీ స్కామ్‌లు జరుగుతున్నాయని ఆరోపణ
- కార్మికుల బోనస్‌లు కోత, వారసత్వ ఉద్యోగాల నిలిపివేతపై ఆగ్రహం
- గజ్వేల్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలికిన కార్యకర్తల "సీఎం" నినాదాలు
- సమస్యలు తీర్చకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరిక

02

# పెట్టుబడులకు కేరాఫ్ తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి**

సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు అనేవి కేవలం ఎన్నికలప్పుడే ఉండాలని, అభివృద్ధి విషయంలో కాదని స్పష్టం చేశారు. 2047 నాటికి స్వతంత్ర భారతం వందేళ్లు పూర్తి చేసుకోబోతోందని, భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న ప్రధాని మోదీ 'వికసిత్ భారత్ 2047' లక్ష్యానికి రాష్ట్రాల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉందని, దీన్ని 10 శాతానికి పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చేందుకే 2025లో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను తీసుకొచ్చామని సీఎం గుర్తుచేశారు. భౌగోళిక పరిస్థితులు, వనరుల ఆధారంగా రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

**కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ**

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ పరిధిలోని 1.34 కోట్ల జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ జోన్‌ను గుర్తించారు. ఇక్కడ కేవలం ఐటీ, సర్వీస్ సెక్టార్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్‌కు మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలించేందుకు రాయితీలు, అనుమతులతో కూడిన 'హిల్ట్ పాలసీ'ని ప్రభుత్వం తీసుకొచ్చింది.



**పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ**

ఓఆర్ఆర్ వెలుపల 50 కి.మీ పరిధిలో 360 కి.మీ మేర రీజినల్ రింగ్ రోడ్డు రూపుదిద్దుకుంటోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్యనున్న 10,500 చ.కి.మీ ప్రాంతాన్ని 'ప్యూర్' జోన్‌గా మార్చి మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తారు. ఇక్కడ పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్, కొత్త స్టార్టప్‌ల ఏర్పాటుకు యువ పారిశ్రామికవేత్తలకు అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి.

**రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ**

రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చ.కి.మీ ప్రాంతాన్ని 'రేర్' జోన్‌గా అభివృద్ధి చేస్తారు. ఇక్కడ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధికి పెద్దపీట వేస్తారు. 400 ఏళ్ల క్రితమే దేశ, విదేశీ వ్యాపారులకు చార్మినార్ ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలిస్తే, ఆ తర్వాత కాలంలో బిజినెస్‌కు హైటెక్ సిటీ ల్యాండ్‌మార్క్‌గా మారిందని సీఎం అన్నారు. మెరుగైన రవాణాతో హైదరాబాద్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగిందని, ప్రపంచంలోని దిగ్గజ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడమే తమ ఆకాంక్ష అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న దేశాలే ఆర్థికంగా బలపడ్డాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణలో మహిళలకు రూ. 61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని.. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లకు మహిళలను ఓనర్లుగా మార్చామని చెప్పారు. యువతతో పాటు మహిళలను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహించాలని సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కొత్త చట్టాలు, మార్పులపై యువతకు అవగాహన కల్పించడంలో సమాఖ్యలు కీలక పాత్ర పోషిస్తాయని సీఎం అభినందించారు. పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో కాపు, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు సాధించిన విజయాలను, వారి సక్సెస్ స్టోరీలను రికార్డు చేసి కొత్త తరానికి స్ఫూర్తిగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె. రఘురామకృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్, మున్నూరు కాపు ఫౌండేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జస్టిస్ భవానీ ప్రసాద్, కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మీరు మారరా..!




**మొదటి పేజీ తరువాయి**

కొందరు అవినీతి అధికారులకు వరంగా మారుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూముల విలువ కోట్ల రూపాయల్లో పలికే ప్రాంతం కావడంతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, మున్సిపల్ విభాగాల్లోని కొన్ని పోస్టులకు భారీ డిమాండ్ ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా పలు శాఖల్లో అధికారుల అక్రమ సంపాదనకు రంగారెడ్డి జిల్లా అద్దం పడుతుంది. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణ కుమారి ఒక ఫిజియోథెరపీ సెంటర్‌కు అనుమతి ఇచ్చేందుకు రూ.1 లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. గతంలో అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి సహా సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి 14 గుంటల భూమికి పట్టాబుక్ జారీకి గుర్రంగూడకు చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ 2024 ఆగస్టు 12న ఏసీబీకి పట్టుబడ్డారు. పాసుబుక్‌లో జెండర్ సవరణకు డబ్బులు డిమాండ్ చేసిన కేసులో ఆమనగల్లు తహసీల్దార్ లలిత సహా సర్వేయర్ రవిపై కేసు నమోదైంది. తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున, వీఆర్ఏ యాదగిరి భూమి పేరు మార్పిడికి రూ.50 వేలు లంచం తీసుకుంటూ దొరికారు. రెవెన్యూ రికార్డులో పేరు మార్పిడి కోసం రూ.9 లక్షలు లంచంగా తీసుకుంటూ కేశంపేట తహసీల్దార్ లావణ్య సహా వీఆర్ఓ అనంతయ్య పట్టుబడ్డారు. ఓ ఇంటి స్థలం వాల్యూయేషన్, నోడ్యూస్ సర్టిఫికెట్ జారీకి రూ.30 వేలు లంచం తీసుకుంటూ గత మే 5న తలకొండపల్లి మండలం వెల్జాల కార్యదర్శి శరత్ కుమార్ చిక్కారు. ఆదిభట్లలోని ఏడు గుంటల భూమికి పాసుబుక్ ఇచ్చేందుకు రూ.12 లక్షలు డిమాండ్ చేసిన కేసులో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ఆఫీసులోని రెవెన్యూ ఇన్ స్పెక్టర్ జి. కృష్ణ అరెస్ట్ అయ్యారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై సర్వే లాండ్స్ అధికారి శ్రీనివాసులుపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈయన ఏకంగా రూ. వంద కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టినట్లు తేల్చింది. తుర్కయంజాల్ పరిధిలో 200 గజాల గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్కు రూ.70 వేలు లంచంగా తీసుకుంటూ వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి చిక్కారు. ఓ ప్రైవేటు సీబీఎస్ఈ స్కూలుకు ఎన్ఓసీ జారీ చేసేందుకు డీఈఓ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీధర్ రూ.70 వేలు లంచం తీసుకుంటూ గత ఫిబ్రవరి 15న దొరికారు. విక్టోరియా మెమోరియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభుదాస్ ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ గత ఏడాది ఏసీబీకి పట్టుబడ్డారు. మీర్ పేట పోలీసు స్టేషన్ లో ఓ బాధితుడి నుంచి వైన్ బాటిళ్లు డిమాండ్ చేసిన కేసులో ఇద్దరు పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. బడంగ్ పేటలో ఏకంగా కమిషనర్ సహా పది మంది ఉద్యోగులపై జీహెచ్ఎంసీ కమిషనర్ వేటు వేశారు. బఫర్ జోన్లలో నిర్మాణాలకు ఎన్సీ జారీకి రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో జిల్లా నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్ సహా ఏఈ కె.కార్తీక్, ఎస్ఈ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్ ఏఈ హెచ్. నికేశ్ కుమార్, గండిపేట మండల సర్వేయర్ పి.గణేశ్ ఏసీబీకి చిక్కారు. యాచారం తహసీల్దార్ గా పని చేసిన సుచరిత ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఇటీవల జైలుకు వెళ్లారు. తాజాగా ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్ ఆఫీసులో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ దేశాని శ్రీనివాసరెడ్డి ఇల్లు సహా ఆఫీసులోనూ ఏసీబీ సోదాలు చేసింది. ఇప్పటికే ఆయన ఓసారి ఏసీబీకి పట్టుబడ్డారు. బాలాపూర్, శంషాబాద్ తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో భారీ అక్రమాలకు పాల్పడినట్లు, ప్రభుత్వ, అసైన్డ్, యూఎల్సీ భూముల అన్యాక్రాంతానికి పరోక్షంగా సహకరించి, రియల్టర్లు, కబ్జాదారుల నుంచి భారీగా లబ్ధి పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. కొన్నేళ్ల కింద అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డిని పెట్రోలు పోసి తగులబెట్టిన ఘటన తర్వాత కూడా కొందరు అధికారులు జంకడం లేదు. తాజాగా ఇదే మండల తహసీల్దారు సుదర్శన్ రెడ్డి అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి దొరికారు. 10 ఎకరాల భూమి సర్వే అప్రూవల్కు రూ.20 లక్షల లంచం డబ్బులు తీసుకుంటూ ఆయన సహ సర్వేయర్ ఏసీబీకి చిక్కడం గమనార్హం. గతంలో జరిగిన విషాద ఘటనలు కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, భూ వ్యవహారాల పరిష్కారంలో జవాబుదారీతనం ఎంత అవసరమో గుర్తుచేస్తోంది.

## దొర అహంకారంతో వ్యవహరిస్తున్న బల్మూరి వెంకట్

**డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి**

**విశాలభారతి:**

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేశారు..ఆయన బల్మూరి వెంకట్ కాదు ఇచ్ గార్డు వెంకట్ అని కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బల్మూరి వెంకట్ గాలి మాటలు మాట్లాడుతున్నాడు. విప్‌గా గా ప్రజలకు మంచి పనులు చేయాల్సింది పోయి.. ఎంతసేపు విమర్శించడమే సరిపోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ ఆసుపత్రి మెడికవర్ ఆసుపత్రి. మెడికవర్ ఆసుపత్రిలో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. మెడికవర్ ఆసుపత్రి వద్ద వందల సంఖ్యలో పోలీసులు ఉంటున్నారు. కాంగ్రెస్ నాయకులు పసలేని అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సినిమా ప్రమోషన్ కోసం ఎక్కడైనా పెట్టుకుంటారు. సిరిసిల్లను కేటీఆర్ ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేశారని కేతిరెడ్డి అన్నారు. కొండా సురేఖ, చిన్నా రెడ్డి, యాడ్ ఏజెన్సీ మహిళను బంధించింది ఎవరు...? కుంభకోణాలకు అడ్డగా గాంధీ భవన్ మారింది.కాంగ్రెస్ కాదు స్కాంగ్రెస్ గా మారిపోయింది. కాంగ్రెస్ అవినీతిపై దేశ ప్రధాని మోదీనే చెప్పిండు. రాష్ట్రంలో R&R ట్యాక్స్ వసూల్ చేస్తున్నారని..మంత్రులు 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. మంత్రుల కమిషన్లపై పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. బల్మూరి వెంకట్ దొర అహంకారంతో వ్యవహరిస్తున్నాడు. దళిత NSUI రాష్ట్ర అధ్యక్షుడిని వేధించాడు. మా నాయకుల పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే బల్మూరి వెంకట్ నాలుక కోస్తామని కేతిరెడ్డి హెచ్చరించారు.

# 22ఏ జాబితా పేరుతో దందా

**మొదటి పేజీ తరువాయి**

తీవ్ర ప్రభావం చూపుతుందని నాయకులు భావిస్తున్నారు. మేడ్చల్ జిల్లా కాప్రాలో ఒక సర్వే నంబరులోని పూర్తి విస్తీర్ణాన్ని సెక్షన్ 22ఏ కింద నమోదు చేయడంతో సమస్య మరింత జటిలమైంది. హిస్టరికల్ రెవెన్యూ రికార్డులు, మ్యుటేషన్ ప్రొసీడింగ్స్, రిజిస్ట్రేషన్ సేల్స్, హుడా అనుమతులు అన్నీ ఉన్నాయని యజమానులు చెబుతున్నారు. 1991 నుంచి 1992 మధ్య కాలంలో పహానీలో పట్టాగా నమోదైన తర్వాతే ఓ బడా కంపెనీ ఈ భూమిని కొనుగోలు చేసింది. ఆ తర్వాత లే అవుట్లు వేసి విక్రయించగా వల్లభనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి. 1995 జీవో 211 ప్రకారం కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్పులు చేశారు. అదే సంవత్సరంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీకి గ్రీన్ బెల్ట్, డెవలప్మెంట్ చార్జీలు కూడా పూర్తిగా చెల్లించారు. గ్రూప్ హౌజింగ్ స్కీం కింద అప్పట్లోనే అన్ని రకాల అనుమతులు జారీ చేసినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే 1955 నుంచి 1958 వరకు పోరంబోకుగా ఉన్న ఈ భూమి తరువాత కాలంలో మార్పులకు గురైంది. రెవెన్యూ అధికారుల రికార్డుల మాయాజాలం వల్ల ఇక్కడ ప్లాట్లు కొన్న అమాయక ప్రజలు ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీవోబీ నుంచి తమ ఆస్తులను డెలిట్ చేయించుకునేందుకు కాలనీ అసోసియేషన్లు రంగంలోకి దిగి వ్యూహరచన చేశాయి. తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు సమర్పించేందుకు దాదాపు 21 రకాల డాక్యుమెంట్లతో పకడ్బందీగా డ్రాఫ్ట్ సిద్ధం చేశారు. ఇదంతా చూసి సంతోషించిన యజమానులకు కొద్ది రోజుల్లోనే భారీ షాక్ తగిలింది. సుమోటోగా చేయాల్సిన ఈ పనికి ప్రతి ప్లాట్‌కు ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని అసోసియేషన్ పెద్దలు తీర్మానం చేశారు. ఎప్పుడో కొనుగోలు చేసిన ఆస్తులకు ఇప్పుడు అంత మొత్తం ఎందుకు చెల్లించాలని కొందరు యజమానులు గట్టిగా నిలదీశారు. అందరి ప్లాట్లు తొలగిస్తే తమది కూడా తీసేస్తారని, ఒక్కరి కోసం ఎందుకు పెండింగ్ పెడతారని మండిపడ్డారు. పైసా ఖర్చు లేకుండా చేయాల్సిన



పనులకు వసూళ్ల దందా జోరుగా సాగుతోంది. అధికారుల పేర్లు చెప్పి కొందరు మధ్య దళారులు భారీగా డబ్బులు గుంజుతున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. రెసిడెంట్స్ అసోసియేషన్ల పేరుతో కూడా కొన్ని ప్రాంతాలలో ఈ వసూళ్ల పర్వం చాలా వేగంగా కొనసాగుతోంది. లే అవుట్లు నాలుగైదు సర్వే నంబర్లలో ఉంటే సేల్ డీడ్‌లో అన్ని నంబర్లు ఉండకూడదని కొందరు తహశీల్దార్లు కొత్త నిబంధనలు పెడుతున్నారు. ప్లాట్ ఏ సర్వే నంబరులో ఉందో యజమానియే కచ్చితంగా తెలపాలని, లేదంటే భూ భారతిలో అప్లై చేసుకోవాలని చెప్తున్నారు. ఆ తరువాత సర్వే చేసి ఆ నంబరు పీవోబీలో లేకపోతే ఎండార్స్‌మెంట్ ఇస్తామని, లేదంటే కలెక్టర్‌కు రాస్తామని కాలయాపన చేస్తున్నారు. అక్కడి నుంచి ఎన్వోసీ తెచ్చుకోవాలంటూ అధికారుల చుట్టూ తిప్పుతుండటంతో యజమానులకు చుక్కలు ఎదురవుతున్నాయి. ఈ తిరస్కరణల నేపథ్యంలో ప్రజలు ఖర్చుకు వెనుకాడకుండా దళారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. రూ.లక్షలు, రూ.కోట్లు విలువ చేసే ఆస్తులు ఎక్కడ తమవి కాకుండా పోతాయోనన్న భయం వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అవసరానికి అమ్ముదామంటే ఎవరూ ముందుకు రారని రుజువు కావడంతో క్లీన్ షీట్ కోసం ఎంతైనా ఖర్చు పెట్టేందుకు సిద్ధపడుతున్నారు. అధికారుల అండదండలతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా రాష్ట్రవ్యాప్తంగా జోరుగా ముందుకు సాగుతోంది. రెవెన్యూ అధికారుల తీవ్ర తప్పిదాల వల్ల లక్షలాది మంది సామాన్య ప్లాట్లు, ఇండ్ల యజమానులు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. చేసిన తప్పులను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ వారు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సుమోటోగా సెక్షన్ 22ఏ డేటాను మార్చుకోవాలని, సేల్ డీడ్ ఆధారంగా కొనుగోలు చేసిన వారి ప్రాపర్టీలను విధిగా తొలగించాలని కోరుతున్నారు. కానీ అప్లికేషన్లు పెట్టాలని, డాక్యుమెంట్లు సమర్పించాలని రకరకాల కొర్రీలు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ డాక్యుమెంట్ లేదు, ఆ పత్రంలో పొరపాటు ఉందని, పాత పహానీలో లావుని ఉందని చెప్పి ప్రజలను తీవ్రంగా భయపెడుతున్నారు. అదే ల్యాండ్‌లో ఆ తర్వాత మార్పులు చేసిన అధికారులను మాత్రం ఎవరూ ప్రశ్నించడం లేదు. తప్పుడు రికార్డులు రాసిన వారికీ, అసైన్డ్ భూముల్లో లే అవుట్లకు అనుమతులు ఇచ్చిన ఏ ఒక్క అధికారికి కూడా ఎలాంటి శిక్షలు పడలేదు. డబ్బులు పెట్టి ఆస్తులు కొనుగోలు చేసిన సామాన్య ప్రజలు మాత్రం నేడు అదే అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తోంది.

# ఇవి తింటే రోగాలే..

- **ఏడు హోటళ్ల లైసెన్సులు సస్పెండ్.. నమూనాల సేకరణ**

**విశాలభారతి, సిటీబ్యూరో:**

టీజీసేఫ్ తనిఖీల్లో కొన్ని చోట్ల కూరగాయలు కుళ్లిపోయి ఉండగా, మరికొన్ని చోట్ల ఆహార పదార్థాలపై ఫంగస్ కనిపించిందని, ఫ్రిజ్‌లలో శాకాహార, మాంసాహార పదార్థాలను ఒకేచోట కలిపి నిల్వ చేయడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను ఉంచడం, వండిన ఆహారాన్ని వార్తాపత్రికలపై పెట్టడం వంటి ప్రజారోగ్యానికి హాని కలిగించే చర్యలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. పీపుల్ కంబైన్ హాస్పిటాలిటీలో పెసరపప్పుపై పురుగుల బెడద, అపరిశుభ్రమైన ఫ్రిజ్ లు, తుప్పుపట్టిన వంట పరికరాలు, సరైన పద్ధతిలో ఆహార పదార్థాలను నిల్వ చేయకపోవడం వంటి లోపాలు గుర్తించారు. అమ్మచేతి వంటలో కుళ్లిన కూరగాయలు, జీడిపప్పు, శనగపిండి వంటి పదార్థాలపై ఫంగస్, అపరిశుభ్రమైన ఫ్రీజర్లు, వంట పరికరాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తనూజా హోటల్స్‌లో జారుడుగా మారిన దెబ్బతిన్న వంటగది నేల, ఆహార వ్యర్థాలతో నిండిన డ్రైనేజీ ట్రాప్స్, బొద్దింకలు, ఈగలు, కుళ్లిన టమాటాలు, నిమ్మకాయలు గుర్తించారు. శ్రీ ఆద్య గ్రాండ్ రెస్టారెంట్ లో ఉపయోగించిన నూనె ముదురు రంగులో ఉండటంతో పాటు, ఫ్రిజ్ లో శాకాహార, మాంసాహార పదార్థాలను కలిపి ఉంచినట్లు తనిఖీల్లో వెల్లడైంది. అకడ గడువు ముగిసిన, లేబుళ్లు లేని ఆహార పదార్థాలు కూడా గుర్తించారు. ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ (సంగం హోటల్)లో బిర్యానీకి సంబంధించిన మిగిలిపోయిన చికెన్ ముకలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, ఆహారంపై ఎలుకల విసర్జనలు, ఫంగస్ పట్టిన మునగకాయ ముకలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైవే హాస్పిటాలిటీలో తినేందుకు ఉపయోగించే ఐస్ ముకలను పచ్చి మాంసంతో కలిపి నిల్వ చేయడం, లేబుళ్లు లేని పదార్థాలు, తుప్పుపట్టిన స్టాండ్లు గుర్తించారు. శ్రీ మమత లాడ్జ్ అండ్ రెస్టారెంట్ లో కుళ్లిన గుడ్లు, చెడిపోయిన కూరగాయలు, జిడ్డు పేరుకుపోయిన స్టవ్ లు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు, సరైన డ్రైనేజీ, గాలి ప్రసరణ లేకపోవడాన్ని గుర్తించారు.



**ఏడు హోటళ్ల లైసెన్స్‌లు రద్దు..**

నల్గొండ జిల్లాలోని చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఉన్న పీపుల్ కంబైన్ హాస్పిటాలిటీ ఎల్ఎల్పీ (7 మిడ్ వే ప్లాజా), నారట్ పల్లిలోని అమ్మచేతి వంట (ఎం/ఎస్ అంజనా టిఫిన్స్ ), సూర్యాపేటలోని తనూజా హోటల్స్ , యాదాద్రి భువనగిరి జిల్లా మలాపూర్ లోని శ్రీ ఆద్య గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, చౌటుప్పల్ యెల్లగిరి ఎక్స్ రోడ్డులోని ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ (సంగం హోటల్ ), సూర్యాపేట జిల్లా రాయణిగూడెం వద్ద ఉన్న హైవే హాస్పిటాలిటీ, సూర్యాపేటలోని శ్రీ మమత లాడ్జ్ అండ్ రెస్టారెంట్‌ల లైసెన్సులను అధికారులు సస్పెండ్ చేశారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా హోటళ్లలో కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించి, వాటిని మూసివేయించారు.

# రేపు ఢిల్లీలో తిరంగా మార్చ్

- **అసమ్మతిని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వ యత్నం**
- **జంతర్ మంతర్‌లో జాతీయ జెండా ఎగురేయడమే నేరమా?**
- **దేశంలో అనధికారిక ఎమర్జెన్సీ.. సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కే ఫైర్**
- **తీహార్ జైలుకు సీజేపీ నేతలు ఆశుతోష్ రాంకా, సౌరవ్ దాస్**
- **ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

**విశాలభారతి, న్యూఢిల్లీ:**




ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఉన్న సెంట్రల్ పార్క్‌లో ఈ నెల 16న 'లెహ్రాదో తిరంగా' (త్రివర్ణ పతాకాన్ని ఎగరవేయండి) పిలుపుతో కొత్తగా నిరసనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బుధవారం ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలను ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించడంపై దీప్కే స్పందించారు. కేంద్ర ప్రభుత్వం అసమ్మతిని అణచివేస్తున్నదని ఆరోపించారు. ఆశు, సౌరవ్‌లను ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. వారి తప్పేంటి? జంతర్ మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే అని దీప్కే పేర్కొన్నారు. నరేంద్ర మోదీ..కొంచెం ధైర్యం చూపండి. అసమ్మతిని అణచివేయాలని మీకు అంతగా పట్టుదల ఉంటే ఇలాంటి పిరికిపంద చర్యల వెనుక దాక్కోవడం మానేసి అధికారికంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించే ధైర్యం చేయండి అని దీప్కే సవాలు విసిరారు. అక్టోబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు త్రివర్ణ పతాకంతో దేశభక్తులందరూ సెంట్రల్ పార్క్‌కు రావాలని కోరుతున్నాను. త్రివర్ణ పతాకం ఎగరవేయడం నేరం కాదని మనం నిరూపిద్దాం అని పేర్కొన్నారు.

**జ్యుడీషియల్ కస్టడీకి ఆశుతోష్, సౌరవ్**

నిరసనలకు అనుమతి రద్దయిన జంతర్ మంతర్‌కు చేరుకునేందుకు ఒక ప్రైవేట్ ఆవరణలోకి చొరబడటం, శాంతిని కాపాడాలన్న బెయిల్ షరతులను ఉల్లంఘించడం వంటి ఆరోపణలపై సీజేపీ నాయకులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్టు పోలీసులు తెలిపారు. వారి సహచరుడు అజింక్యా షిండేను ఆరు నెలల పాటు శాంతియుతంగా సత్ప్రవర్తనతో మెలిగేలా కట్టుబాటు విధించి వ్యక్తిగత పూచీకత్తు, రూ.5,000 పూచీకత్తుపై విడుదల చేసినట్టు పోలీసులు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితులు పదేపదే చట్టాన్ని ఉల్లంఘించడం, బెయిల్‌పై విడుదల చేస్తే మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించి ఇతరులను రెచ్చగొడతారనే అనుమానాన్ని వ్యక్తం చేసిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ దాస్, రాంకాలను ఐదు రోజుల పాటు తీహార్ జైలుకు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు.

**నిరసనలతో హోరెత్తిన ఢిల్లీ**

సెంట్రల్ ఢిల్లీ సమీపంలో బుధవారం విద్యార్థి సంఘాలు, ఇతర సంస్థలు ధర్నాలు చేపట్టాయి. 'సర్', సీఈసీకి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఇండియన్ యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నిరసనలు నిర్వహించాయి.

# బ్లూ డ్రమ్ కేసులో భార్య, ప్రియుడికి మరణ శిక్ష

- **మీరట్ కోర్టు సంచలన తీర్పు**
- **శిక్ష కూడా ధర్మంలో భాగమేనన్న న్యాయమూర్తి**
- **మరణ శిక్ష విధించినా పర్వాలేదన్న నిందితురాలి తల్లిదండ్రులు**
- **కోర్టు ప్రాంగణంలో ప్రజల వేడుకలు**

**విశాలభారతి, మీరట్:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి, దిగజారుతున్న వైవాహిక విలువలకు ప్రబల ఉదాహరణగా నిలిచిన యూపీ మీరట్‌లోని బ్లూ డ్రమ్ కేసులో భర్తను దారుణంగా హతమార్చిన భార్య, ఆమె ప్రియుడికి న్యాయస్థానం మరణ శిక్ష విధించింది. ఈ కేసులో హతుని భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లాలకు మరణశిక్ష విధిస్తున్నట్టు జిల్లా, సెషన్స్ జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా బుధవారం తీర్పు చెప్పారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి మహాభారతాన్ని ఉదహరిస్తూ శిక్ష కూడా ధర్మంలో భాగమేనని పేర్కొన్నారు. నిందితులిద్దరినీ జైలులో నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. శిక్ష ప్రకటించినప్పుడు హతుడు సౌరభ్ తల్లి రేణు రాజ్‌పుట్, అతని సోదరుడు కోర్టు ప్రాంగణంలోనే ఉన్నారు. నిందితులకు మరణ శిక్ష పడగానే కోర్టు హాలంతా భారత మాతా కీ జై నినాదాలతో హోరెత్తింది. న్యాయస్థానం, ప్రాంగణంలో పలువురు వేడుకలు చేసుకున్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. మర్చంట్ నేవీ అధికారిగా పనిచేస్తున్న సౌరభ్‌ను 2025, మార్చి 3న అతని భార్య ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్ హత్యచేశారు. తర్వాత అతడి శరీరాన్ని ముక్కలుగా నరికి ఒక బ్లూ డ్రమ్‌లో పెట్టి దానిని సిమెంట్‌తో నింపారు. పోలీసులు నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి బ్లూ డ్రమ్‌ను, అందులోని మృతదేహ అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు.



**ఇష్టం లేకపోతే విడిపోండి**

పెండ్లయిన తర్వాత తమ జీవిత భాగస్వామి నచ్చకపోతే చట్టాన్ని ఆశ్రయించి విడిపోవాలే తప్ప ఎలాంటి హింసకు పాల్పడవద్దని మృతుని తల్లి దంపతులకు విజ్ఞప్తి చేసింది. 'మీకు కలిసి ఉండటం ఇష్టం లేకపోతే విడిపోండి, అంతేకాని మీ భాగస్వామిని హతమార్చి వారి తల్లిదండ్రులకు కడుపు కోత మిగల్చొద్దు. మా బిడ్డ భౌతికంగా మాకు దూరమైనా వాడి జ్ఞాపకాలు ఎక్కడికీ పోలేదు. మా ఇంటిలోని అంగుళం అంగుళం అతడి జ్ఞాపకాలతో నిండి ఉన్నాయి' అని ఆమె కన్నీటితో పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడే వారికి మరణ శిక్ష విధించాల్సిందేనన్నారు.

**మా అమ్మాయికి ఉరేసినా పర్వాలేదు**

అల్లుడిని దారుణంగా హతమార్చిన తమ కుమార్తెకు మరణశిక్ష విధించినా తమకు అభ్యంతరం లేదని ముస్కాన్ తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు న్యాయస్థానానికి ఒక రాతపూర్వక ప్రకటనను సమర్పించారు. 'మా అమ్మాయి దారుణమైన తప్పు చేసింది. ఒక వేళ ఆమెకు మరణ శిక్ష విధిస్తే మేం ఎంతమాత్రం వ్యతిరేకించబోం' అని వారు పేర్కొన్నారు. సౌరభ్ కుటుంబ సభ్యులు కూడా నిందితులకు గరిష్ఠ దండన అయిన మరణ శిక్షను విధించాలని కోరారు.

# భూదాన్ భూములపై ఉక్కుపాదం!

- నల్లెల్లలో 24.28 ఎకరాలపై రెవెన్యూ విచారణ.
- సర్వే నంబర్ 350లో అసలేం జరిగింది
- భూభారతి రికార్డుల్లో 11 మంది పేర్లు.. నమోదు వెనుక ఆధారాలేవి?
- ఆక్రమణలు, మట్టి తవ్వకాల ఆరోపణలపై ఫిర్యాదు
- నేడు క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారుల విచారణపైనే సర్వత్రా ఆసక్తి!

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** పేదలకు భూములు అందించాలనే లక్ష్యంతో ముడిపడిన భూదాన్ భూముల విషయంలో అసలు వాస్తవాలు ఏమిటి? నల్లెల్ల గ్రామంలోని 24.28 ఎకరాల భూమికి సంబంధించిన హక్కులు ఎవరివి? పాత రికార్డుల్లో ఉన్న వివరాలకు, ప్రస్తుత భూభారతి నమోదులకు మధ్య ఏమైనా వ్యత్యాసాలున్నాయా? భూమి విస్తీర్ణం, హద్దులు, ఉపవిభాగాల ఏర్పాటు వెనుక ఉన్న ఆధారాలేమిటి? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాబట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 350లో ఉన్న భూములపై సామాజిక కార్యకర్త వీరిశెట్టి ఉపేందర్ ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. సంబంధిత పట్టాదారులకు నోటీసులు జారీ కావడం, అక్టోబర్ 15న క్షేత్రస్థాయి విచారణకు ఏర్పాట్లు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**24.28 ఎకరాల భూమి.. తేలాల్సిన లెక్కలెన్నో!**

సర్వే నంబర్ 350లోని 24.28 ఎకరాల భూమికి సంబంధించి అసలు విస్తీర్ణం, భూమి స్వరూపం, హక్కుల వివరాలు, ప్రస్తుత రెవెన్యూ రికార్డుల్లో నమోదైన మార్పులపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్ ముందుకొచ్చింది. సీరోలు మండలం కొత్తూరు (సి) గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వీరిశెట్టి ఉపేందర్ ఈ అంశాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. భూముల ఆక్రమణకు సంబంధించిన ఆరోపణలు, మట్టి తవ్వకాల అంశాలను కూడా పరిశీలించాలని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కురవి తహశీల్దార్ కార్యాలయం అక్టోబర్ 13న ఆర్‌సీ నంబర్ ఏ/978/2026 ద్వారా సంబంధిత పట్టాదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. భూమి ఎవరిది?



| వరుస సంఖ్య | సర్వే నంబరు | విస్తీర్ణము | పట్టాదారు పేరు | రిమార్కులు |
|---|---|---|---|---|
| 1 | 350/A/4/1/1/1/1 | 2.0700 | యర్రంరెడ్డి సుధాకర్ రెడ్డి (యర్రంరెడ్డి జగన్నాథరెడ్డి) | |
| 2 | 350/A/1 | 2.1400 | అంబటి శకుంతల (వీరభద్రం) | |
| 3 | 350/A/1 | 1.0000 | అంబటి శకుంతల (వీరభద్రం) | |
| 4 | 350/A/2/1 | 1.1300 | గండు భిక్షం (భద్రయ్య) | |
| 5 | 350/A/3 | 3.3300 | మంచిపోలు విశాల్ రెడ్డి (చంద్రా రెడ్డి) | |
| 6 | 350/A/2/2 | 1.0000 | పల్లా విష్ణు (రాంరెడ్డి) | |
| 7 | 350/B | 5.3100 | వినోలా భావి (భావి) | |
| 8 | 350/A/4/1/1/1/2 | 1.0000 | తేజావత్ మంగీలాల్ (బిచ్చు) | |
| 9 | 350/A/4/2 | 3.0000 | శైలా అనిత (సుధాకర్) | |

హక్కులు ఎలా వచ్చాయి? రికార్డుల్లో మార్పులు ఎందుకు జరిగాయి? అన్న ప్రశ్నలకు ఊహాగానాలతో కాకుండా అధికారిక పత్రాలతో సమాధానం చెప్పాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంది.

**రికార్డుల్లో 11 మంది పేర్లు.. హక్కులకు ఆధారాలున్నాయా?**

సర్వే నంబర్ 350/ఏ, 350/బీ తదితర ఉపవిభాగాలకు సంబంధించి ప్రస్తుత భూభారతి రికార్డుల్లో పలువురి పేర్లు నమోదై ఉన్నట్లు సమాచారం. ఈ నమోదులకు సంబంధించిన పత్రాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఫిర్యాదు నేపథ్యంలో స్పష్టమవుతోంది. అయితే రికార్డుల్లో పేర్లు ఉన్నాయన్న కారణంతోనే అక్రమాలు జరిగినట్లు నిర్ధారించలేం. అదే సమయంలో నమోదుల వెనుక ఉన్న ఆధారాలను పరిశీలించకుండా అసలు విషయాన్ని తేల్చలేం. పాత భూదాన్ రికార్డుల్లో భూమి హక్కుల వివరాలేమిటి? ప్రస్తుత పట్టాదారుల పేర్లు ఏ ప్రాతిపదికన నమోదయ్యాయి? భూమి బదిలీలు, మ్యుటేషన్లు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా? ఉపవిభాగాల ఏర్పాటు వెనుక సర్వే ఆధారాలున్నాయా? ఈ ప్రశ్నలకు అధికారులు పత్రాల ఆధారంగా స్పష్టత ఇవ్వాలి.

**నేడు క్షేత్రస్థాయి విచారణ.. కాగితాలకే పరిమితమవుతుందా?**

అక్టోబర్ 15న ఉదయం 10 గంటలకు నల్లెల్ల గ్రామంలోని సర్వే నంబర్ 350 వద్ద క్షేత్రస్థాయి విచారణ



| | | | |
|---|---|---|---|
| 11 | 350/A/4/1/1/2 | 2.1800 | |

కావున పైన పేర్కొనబడిన రైతులు ప్రస్తుత భూభారతి నందు పట్టాదారులుగా నమోదై వున్నందున విచారణ నిమిత్తము మీ వద్ద కల ఆధారములతో ది.15.10.2026 న ఉదయము 10.00 గంటలకు నల్లెల రెవిన్యూ గ్రామములోని సర్వే నెం. 350 నందు ప్రదేశము పై హాజరు కావాలసినదిగా కోరనైనది.

తహశీల్దారు, కురవి

నిర్వహించాల్సి ఉందని తహశీల్దార్ కార్యాలయం జారీ చేసిన నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. సంబంధిత పట్టాదారులు తమ హక్కుల పత్రాలతో హాజరుకావాలని సూచించినట్లు తెలిసింది. మండల సర్వేయర్‌ను కూడా విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ విచారణలో భూమిని పరిశీలించి హద్దులు గుర్తించడంతోనే అధికారులు సరిపెట్టకూడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాత రికార్డులు, ప్రస్తుత నమోదులు, భూమిపై వాస్తవ పరిస్థితులను సమన్వయంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. భూమి విస్తీర్ణంలో తేడాలున్నాయా? ఉపవిభాగాల ఏర్పాటు నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? మట్టి తవ్వకాలు జరిగి ఉంటే అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను విచారణ పరిధిలోకి తీసుకోవాలి. విచారణకు ఎవరైనా హాజరు కాని పక్షంలో కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం.

**పాత భూదాన్ రికార్డులే అసలు పరీక్ష!**

ఈ వ్యవహారంలో పాత భూదాన్ రికార్డులు అత్యంత కీలకం కానున్నాయి. సేత్వార్, పహాణీలు, అడంగల్, మ్యుటేషన్ పత్రాలు, రిజిస్ట్రేషన్ దస్తావేజులు, సర్వే మ్యాపులు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను ప్రస్తుత భూభారతి నమోదులతో పోల్చి పరిశీలించాలి.

పాత రికార్డుల్లోని విస్తీర్ణం ఎంత? భూమి హక్కులకు సంబంధించిన వివరాలేమిటి? ప్రస్తుతం ఉన్న ఉపవిభాగాలు ఏ ప్రాతిపదికన ఏర్పడ్డాయి? హక్కుల మార్పులకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా? అన్న అంశాలను నిర్ధారించకుండా విచారణను ముగిస్తే అనేక ప్రశ్నలు అలాగే మిగిలిపోయే ప్రమాదం ఉంది. రికార్డుల్లో తేడాలు ఉంటే వాటి వెనుక కారణాలను తేల్చాలి. ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో చట్టబద్ధమైన హక్కులు కలిగిన వారికి అన్యాయం జరగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

**భూదాన్ భూముల పరిరక్షణపై బాధ్యత ఎవరిది?**

భూదాన్ భూముల పరిరక్షణలో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం. భూముల అసలు స్వరూపం, హక్కులు, విస్తీర్ణం, రికార్డుల నిర్వహణపై స్పష్టత ఉండాలి. ఫిర్యాదులు అందినప్పుడు వాటిని సాధారణ ప్రక్రియగా తీసుకోకుండా, అందుబాటులో ఉన్న పత్రాల ఆధారంగా సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది.నల్లెల్ల భూముల విషయంలో గతంలో ఎలాంటి పరిశీలనలు జరిగాయి? భూముల హద్దులను ఎప్పుడైనా అధికారికంగా నిర్ధారించారా? ప్రస్తుత రికార్డుల్లో పేర్ల నమోదుకు ఏ పత్రాలు ఆధారంగా ఉన్నాయి? భూమి పరిరక్షణకు తీసుకున్న చర్యలేమిటి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని విచారణలో తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆరోపణలకు ఆధారాలు లభించని పక్షంలో ఆ విషయాన్నీ స్పష్టంగా వెల్లడించాలి. విచారణలో పారదర్శకత, రికార్డుల్లో స్పష్టత, చర్యల్లో నిష్పక్షపాతమే ఈ వ్యవహారానికి పరిష్కారం చూపగలవు.

**24.28 ఎకరాల అసలు కథ తేలేనా?**

నల్లెల్ల సర్వే నంబర్ 350లోని భూములకు సంబంధించి ఫిర్యాదుతో మొదలైన ఈ వ్యవహారంలో ఇప్పుడు అందరి దృష్టి రెవెన్యూ అధికారుల విచారణపై పడింది. భూముల అసలు విస్తీర్ణం, హక్కుల వివరాలు, ప్రస్తుత రికార్డుల్లో నమోదైన పేర్లకు ఆధారాలు, ఆక్రమణలు మరియు మట్టి తవ్వకాల ఆరోపణలపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. భూదాన్ భూములపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణే సమాధానం కావాలి.. అధికారిక రికార్డులే ఆధారాలు కావాలి.. చట్టప్రకారం చర్యలే తుది నిర్ణయానికి ప్రాతిపదిక కావాలి. నల్లెల్ల భూముల విషయంలోనూ అదే పారదర్శకత కనిపించాలని, విచారణ నివేదికలో వాస్తవాలను వెల్లడించాలని స్థానికంగా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్ 15న జరగనున్న క్షేత్రస్థాయి విచారణలో ఏయే అంశాలు వెలుగులోకి వస్తాయి? భూముల హక్కులు, విస్తీర్ణంపై అధికారులు ఎలాంటి నిర్ధారణకు వస్తారు? అన్నది వేచి చూడాల్సిందే.

## రైతులకు రోజుకు 18 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి




**ఆలేరు, విశాల భారతి:** రైతాంగానికి రోజుకు 18 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఆలేరులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ, వర్షాలు లేక పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు అందక పొలాలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆలేరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, రైతాంగానికి కరువు నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా పంటలకు నీరు అందక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించేలా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు రైతుల పక్షాన నిలిచి వారికి భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే రైతులను చైతన్యపరిచి విద్యుత్ కార్యాలయాల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, మండల కార్యవర్గ సభ్యుడు కందుల మధు, రైతు నాయకులు గిరబోయిన స్వామి, గుండె బాలరాజు, గ్యాదపాక కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు సాధన దీక్షకు ఫలితం రోడ్డు పనులకు శంకుస్థాపన

- ఎనిమిది రోజుల పోరాటంతో కదిలిన ప్రభుత్వం – అశోక్ నాయక్



**ఆలేరు, విశాలభారతి:** గుండ్లగూడెం రైల్వే గేటు నుంచి పెంబర్తి రైల్వే గేటు వరకు రహదారి పునర్నిర్మాణం కోసం లంబాడి హక్కుల పోరాట సమితి (LHPS) ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు సాధన దీక్షకు ఫలితం దక్కిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ నాయక్ తెలిపారు. గత 20 సంవత్సరాలుగా గుండ్లగూడెం, శివలాల్ తండా, పటేల్ గూడెం, శ్రీనివాసపురం గ్రామాల ప్రజలు అధ్వానంగా మారిన రహదారిపై రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోకపోవడంతో గత ఫిబ్రవరి 18 నుంచి 25వ తేదీ వరకు అశోక్ నాయక్ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల మద్దతుతో ఎనిమిది రోజుల పాటు దీక్ష చేపట్టినట్లు తెలిపారు. దీక్ష నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి స్థానిక అధికారులతో చర్చలు జరిపిందని, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రోడ్డు నిర్మాణంపై హామీ ఇచ్చారని వివరించారు. ఇచ్చిన హామీ మేరకు తాజాగా రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడంతో తమ పోరాటానికి ప్రతిఫలం లభించిందని అశోక్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే తమ గ్రామాలకు రాకపోకలు సులభతరమవడంతో పాటు ప్రమాదాల ముప్పు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## కల్లు గీత కార్మిక సంఘం సదస్సుకు జనగామ నాయకులు



జనగాం విశాలభారతి : హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం 69 వ వార్షికోత్సవాలు కల్లుగీత వృత్తి అధునీకరణ రాష్ట్ర సదస్సుకు జనగామ జిల్లా నుంచి సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సంక్షేమ వృత్తి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు ఆధునిక సాంకేతికతను కల్లుగీత వృత్తిలో ప్రవేశ పెట్టి కార్మికుల భద్రతను పెంచాలని ప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు అందించాలని అన్నారు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిన వెంకట మల్లయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య పరిధిలో భాస్కర్ సంకటి రాజయ్య కమ్మగాని నాగన్న మాచర్ల రఘురాములు బండపల్లి శంకరయ్య కమ్మగాని పరశురాములు తాళ్లపల్లి మదారు తాళ్లపల్లి అశోక్ బసవకాని మహేందర్ వడ్లకొండ వెంకటేష్ యాదన్న పోతుగంటి కృష్ణమూర్తి సోషల్ మీడియా కన్వీనర్ ములుగూరి సంతోష్ గౌడ్ మూల వైకుంఠం పరిధిలో భరత్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రకాళి సమేత వీరభద్రస్వామి సన్నిధిలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నేతలతో కలిసి ప్రత్యేక పూజలు
- స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్ష
- కురవి క్షేత్రంలో ఆధ్యాత్మిక సందడి.



**కురవి,విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** ప్రముఖ పుణ్యక్షేత్రం కురవిలో భక్తిభావం వెల్లివిరిసింది. డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండల కేంద్రంలో కొలువుదీరిన భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామివారిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఆమె, స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

**రాష్ట్ర మహిళా నేతలతో కలిసి ప్రత్యేక పూజలు.**

రాష్ట్ర బీఆర్ఎస్ మహిళా నాయకులతో కలిసి కురవి క్షేత్రానికి చేరుకున్న సత్యవతి రాథోడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యాన్ని స్మరించుకుంటూ భక్తిభావంతో పూజలు నిర్వహించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు వెల్లివిరియాలని, అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

**పలువురు ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు తుల ఉమాకుమారి, బిందు అంగోత్, మంత్రి శ్రీదేవి, కురవి సర్పంచ్ లక్ష్మి రాజునాయక్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, పిచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పెద్ది వెంకన్నగౌడ్, ఐలి నరహరిగౌడ్, బొడ శ్రీనునాయక్, గుగులోత్ నెహ్రూ నాయక్, సంగెం భరత్, భద్రు భోజ్యానాయక్, బానోత్ శారద, అంగోత్ కాంతి తదితరులు పాల్గొన్నారు

## స్మార్ట్ రేషన్ కార్డులపై గ్రామపంచాయతీ పేర్ల కోసం సర్పంచుల వినతి



**చౌటుప్పల్,విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఎదురవుతున్న సమస్యపై సర్పంచులు ఏకమయ్యారు.తమ గ్రామాల గుర్తింపు కోసం కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 12 మాత్రమే రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. మిగతా 14 గ్రామపంచాయతీలు రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం రెవెన్యూ డిపార్ట్మెంట్ (జీపీఓ) ల ద్వారా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై కేవలం రెవెన్యూ విలేజ్ పేర్లు మాత్రమే ముద్రిస్తున్నారు. దీంతో 14 గ్రామపంచాయతీల పేర్లు కార్డులపై కనిపించడం లేదు. దీనివల్ల ఆయా గ్రామాల ప్రజలకు తమ గ్రామ గుర్తింపు లేకుండా పోతోందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రోజు చౌటుప్పల్ మండల సర్పంచులు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ని, చౌటుప్పల్ ఆర్డీఓ,వి. శేఖర్ రెడ్డి ని, ఎంఆర్ఓ శ్రీమతి వీరాభాయ్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులపై రెవెన్యూ విలేజ్ పేరుతో పాటు గ్రామపంచాయతీ పేరు కూడా నమోదు చేయాలని కోరారు. వినతిపత్రం పరిశీలించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరించి, గ్రామపంచాయతీ పేర్లు వచ్చేలా పై అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. అంకిరెడ్డిగూడెం, గుండ్లబావి, ఆరెగూడెం, క్యాటైవ్, చింతలగూడెం, దామెర, ధర్మోజిగూడెం, యానగంటితండా, పెద్ద కొండూరు, మసీదుగూడెం, మందుల్లోగూడెం, కుంట్లగూడెం, ఎల్లంబావి, కొయ్యలగూడెం. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్,గిర్కంటి నిరంజన్ గౌడ్, కైరంకొండ స్వప్న అశోక్, నందగిరి వెంకటేశం గౌడ్, తంగేళ్ల వెంకటేశం, గంజి వనజ కృష్ణ తదితర సర్పంచులు పాల్గొన్నారు.

## బతుకమ్మల బంగారు శోభ

- కలెక్టరేట్‌లో పూల సంబరం
- గౌరీమాతకు పూజలు చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా విశాలభారతి:** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో టీఎన్జీఓ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు గౌరీమాతకు, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించారు. వివిధ శాఖల మహిళా ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సవాల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా ఆటలాడారు. దాండియా, కోలాటాలతో కలెక్టరేట్‌లో సందడి నెలకొంది. ఉత్తమంగా అలంకరించిన బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు సుమన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## డీకంపల్లిలో తాళం పగలగొట్టి చోరీ

- రెండు తులాల బంగారం, తులం వెండి, రూ.లక్ష నగదు అపహరణ
- మాక్లూర్. ఆలూరు మండల్



**నిజామాబాద్ జిల్లా, విశాల భారతి:** అద్దెకు ఉంటున్న డీకంపల్లి గ్రామానికి చెందిన కొండ్ర సాయికుమార్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళం పగలగొట్టి రెండు బీరువాలను ధ్వంసం చేసి రెండు తులాల బంగారు ఆభరణాలు, తులం వెండి వస్తువులతో పాటు రూ. లక్ష నగదును అపహరించారు. సాయికుమార్ గత ఏడాది కాలంగా తన సొంత ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లో నివాసం ఉంటున్నారు. గత వారం ఇంటికి వచ్చినప్పుడు వస్తువులన్నీ యథావిధిగా ఉన్నాయని తెలిపారు. బుధవారం గ్రామ కారోబార్ రమేష్ ఇంటి ముందు నుంచి వెళ్తుండగా తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి సాయికుమార్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి చేరుకున్న సాయికుమార్ పరిశీలించగా రెండు బీరువాలు ధ్వంసం చేసి ఉండటంతో పాటు బంగారు, వెండి ఆభరణాలు, తన తల్లికి చెందిన రూ.లక్ష నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఏల సుందర్



**దేవరుప్పుల విశాలభారతి :** మండల కేంద్రానికి చెందిన బొడ్డుల రమేష్ కుమార్తె పుష్పాలంకరణ వేడుక బుధవారం మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకులు, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ చిన్నారిని ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల గ్రామ ఉప సర్పంచ్ నర్ర కోమలత సోమశేఖర్ తోటకూరి కిష్టయ్య కాసాని సత్యనారాయణ దుంపల సంపత్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక నాయకులు, పలువురు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## రూ.5.90 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

- 5.2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం



**ఆలేరు, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్లగూడెం గ్రామంలో రూ.5 కోట్ల 90 లక్షల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి, స్వయంగా జేసీబీ నడిపి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం 5.2 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ రోడ్డు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరచి, ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చూడటంతోపాటు, గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**ఆలేరు, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని వైఎస్ఎన్ గార్డెన్స్‌లో ఆలేరు మండలానికి చెందిన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్ కార్డులు ఎంతో ముఖ్యమైనవని, వీటి ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థ కింద నిత్యావసర సరుకులు పొందడంతోపాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పేద కుటుంబాల అభ్యున్నతి, ప్రజల సంక్షేమం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతిరాలి కుటుంబాన్ని పరమర్శించిన సర్పంచ్

- ముచర్ల సుగుణ సంపత్



**విశాలభారతి ఇబ్రహీంపట్నం :** యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామ వాసి మక్కపల్లి చంద్రమ్మ బుధవారం మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్, వారి కుటుంబ సభ్యులకు 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. వారి కుటుంబం ఎన్నో సంవత్సరాలనుండి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చేశారని, వారి సేవలు మరువలేమని ఆ కుటుంబానికి ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని వారికి ధైర్యాన్ని ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు మక్కపల్లి మహేష్, బూరె కళమ్మ, సంగెమ్ మధు, రాకేష్, శివ, నరేష్, వంశీ, ప్రశాంత్ గార్లు పాల్గొన్నారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# రైతుకు బాసటగా ఉండి అన్నదాతను కాపాడాలి

- చేను పొట్టకొచ్చింది ట్యాంకర్లతో తడుపుతున్నా..
- రైతు కలకొండ వీరయ్య తులేకలాన్




**విశాల భారతి ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులే కలాన్ గ్రామంలో కలకొండ వీరయ్య అనే రైతు మూడు ఎకరాల భూమి సాగు చేసి వరి పంట వేశారు. వర్షాలు కురవక బోరిబావి అడుగంటింది. వరి పంట పొట్టకొచ్చే సమయానికి, బోరుబావిలో నీళ్లు లేక కరెంటు కోతలతో, వచ్చిపోయే కరెంటుకు మొదటి మడి సరిగ్గా తడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు కలకొండ వీరయ్య మాట్లాడుతూ నేల నెర్రలు బారీ పొట్టకు వచ్చిన చేను కండ్ల ముందే ఎండిపోతుంటే, ఆరుగాలం చేసిన కష్టం మట్టి పాలవుతుంటే ప్రాణం నిలవడం లేదని బాధపడుతున్నారు. రోజుకు 10 ట్యాంకర్లతో తడుపుతూ వరి పంటను బ్రతికించే ప్రయత్నం చేస్తున్నారు. కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతు భరోసాగా బతికాడు. నేడు రైతుకు భరోసా ఇచ్చేవాడు లేడని, కరువు కరెంటు సమస్యలతో తల్లడుగులుతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, రైతుకు బాసటగా నిలి0, అన్న దాతలు కాపాడాలని భావించారు.

# స్టోన్ క్రషర్‌లో గంజాయి కలకలం

- 33 గ్రాముల గంజాయి స్వాధీనం.. ఒకరిపై కేసు నమోదు



**విశాల భారతి, షాద్‌నగర్:** కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వేముల నర్వ గ్రామ శివారులో గంజాయి కలకలం చోటు చేసుకుంది. ఆర్యాన్ మినరల్స్ స్టోన్ క్రషర్ ప్రాంగణంలోని ఓ గదిలో గంజాయి ఉన్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు నిర్వహించి, సుమారు 33 గ్రాముల గంజాయిగా అనుమానిస్తున్న పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13వ తేదీ సాయంత్రం కేశంపేట పోలీసుల ఆధ్వర్యంలో షాద్‌నగర్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ అడ్డాకుల శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, క్లూస్ టీమ్, పంచ సాక్షులతో కలిసి స్టోన్ క్రషర్ ప్రాంగణంలోని ఓ గదిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గది గోడకు వేలాడదీసిన నల్లటి కవర్‌లో ఎండిన ఆకులు, పువ్వుల వంటి గంజాయిగా అనుమానిస్తున్న పదార్థాన్ని గుర్తించారు.అదే గదిలో నివసిస్తున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన రామకృష్ణ పటేల్ (31) వద్ద ఈ పదార్థం లభించడంతో పంచ సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. దీని నికర బరువు సుమారు 33 గ్రాములుగా గుర్తించారు. ఈ ఘటనపై కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఎస్ఐ బి. పరమేష్ దర్యాప్తు చేపట్టారు.

**మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం**

గంజాయి,ఇతర మాదకద్రవ్యాల అక్రమ నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

# చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి

- రాజ్యాధికార పార్టీ నాయకుల నిరాహార దీక్ష.. షాద్‌నగర్ ఆర్డీవోకు వినతిపత్రం



**విశాల భారతి,షాద్ నగర్:** చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు షాద్‌నగర్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు ఉప్పరమోని రాములు, ఎమ్మె సంతోష్ ఆధ్వర్యంలో ఈ దీక్ష నిర్వహించారు. అనంతరం షాద్‌నగర్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోవడంతో పరిసర ప్రాంతాల్లోని సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పార్టీ నాయకులు పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపడతామని కాంగ్రెస్ నాయకులు గత రెండేళ్లుగా చెబుతున్నప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగడం లేదని ఆరోపించారు. బ్రిడ్జి నిర్మాణం ఆలస్యం కావడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిలిచిపోయిన నిర్మాణ పనులను పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే నిరవధిక నిరాహార దీక్షకు సైతం వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ దీక్షలో కొందుర్గు మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు అవ జగన్, చౌదరిగూడ మండల అధ్యక్షుడు దొర్తల రాములు తదితరులున్నారు.

# చెన్నూరును పట్టి పీడిస్తున్న వైరల్ జ్వరాలు

**ఆందోళన చెందుతున్న ప్రజలు**

**విశాల భారతి, చెన్నూరు :** చెన్నూరుపట్టణంతో పాటు మండలంలోని పలుగ్రామాలను వైరల్‌జ్వరాలు పట్టి పీడిస్తుండడం తో ప్రజలు ఆందోళన చెందుతున్నా రు. రోజురోజుకు వాతావరణంలో ఏర్పడుతున్న మార్పులు, పారి శుధ్యం లోపించి ఈగలు, దోమలు వ్యాప్తిచెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజుకు వందల సంఖ్యలో చెన్నూరు సామాజిక ఆరోగ్యకేంద్రానికి జ్వరపీడితులు వస్తుండడంతో ఆసుపత్రి ఆవరణ రోగులతో కిక్కిరిసిపోతున్నది. గడిచిన 14రోజుల్లో దాదాపు 4వేల మంది ఓపీ నమోదు చేయించుకున్నారు. కాగా 600మంది ఆసుపత్రిలో అడ్మిట్ అయి డిశ్చార్జ్ అయ్యారు. ఈనెల 1న 362, 2న 324 మంది, 3న 294 మంది, 4న 153 మంది, 5న 411, 6న 326, 7న 296, 8న 336, 9న 307 , 10న 242, 11న 103, 12న 388, 13న 280 మంది ఓపీనమోదు కాగా బుధవారం 320మంది ఓపీ నమోదు చేయించారు. గడిచిన 14 రోజుల్లో 4146మంది ఓపీనమోదు చేయించుకోగా 620 మంది చికిత్సలు పొందారు. రోజుకు వందల సంఖ్యలో జ్వరపీడితులు తరలివస్తుండడంతో ఆసుపత్రిలో ఉన్న 50బెడ్లు సరిపోక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రిలో బెడ్లు సరికపోకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రితోపాటు మంచిర్యాలలోని ఆసుపత్రులకు వెళ్తున్నారు. వైద్యశాఖ స్పందించి వైద్యశిబిరాలను నిర్వహించి జ్వరాలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**విశాల భారతి, జైపూర్ :** పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. బుధవారం జైపూర్‌లోని పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు. పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో తరుచుగా నమోదవుతున్న నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎస్ఐ భూమేష్‌ను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని, రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు, ఇతర నేరస్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో 5ఎస్ మేనేజ్ మెంట్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. స్టేషన్‌లో విధులు నిర్వహించే ప్రతి అధికారి, సిబ్బందికి సీసీటీఎన్ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలకు, వ్యాపారులకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జరుగు తున్న నేపథ్యంలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వ యంతో హెచ్చరిక బోర్డులను, రహదారి సూచికలు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయించాలన్నారు. సీపీ వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్‌కుమార్ ఉన్నారు.




# కురవిలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన మాజీ మంత్రి
- బీఆర్ఎస్ నేతల సందడితో రెట్టింపైన ఉత్సాహం
- ఆటపాటలు, డీజే హోరుతో మారుమోగిన పండుగ ప్రాంగణం




**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాలు మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో అంబరాన్నంటాయి. మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో కురవి యూత్ నిర్వహించిన ఐదో రోజు బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, సంప్రదాయ పాటలు, డీజే హోరుతో పండుగ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో కురవిలో పండుగ శోభ వెల్లివిరిసింది.

**సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సందడి.**

బతుకమ్మ వేడుకలకు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నాయకత్వం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, ఆటపాటల్లో పాల్గొంటూ ఆమె వేడుకలను మరింత ఉత్సాహభరితంగా మార్చారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ గొప్పతనానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబురాల్లో మహిళలతో మమేకమై సందడి చేశారు. ఆమెతో పాటు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్, మాజీ ఎంపీ మాలోత్ కవిత పాల్గొని వేడుకలకు మరింత ప్రత్యేకత తీసుకొచ్చారు.

**ఆటపాటలతో హోరెత్తిన కురవి బతుకమ్మ ప్రాంగణం.**

డీజే పాటల హోరుతో బతుకమ్మ ప్రాంగణం మారుమోగింది. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడి, నృత్యాలు చేస్తూ సంబురాల్లో మునిగిపోయారు. యువతీ యువకుల ఉత్సాహం, మహిళల కోలాహలం, బతుకమ్మల పూల సోయగాలు కలగలిసి కురవిలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.

**తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టిన వేడుకలు.**

తెలంగాణ అస్తిత్వానికి, ఆడపడుచుల ఐక్యతకు, ప్రకృతితో ముడిపడిన సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు కురవి ప్రాంతంలో పండుగ సందడిని మరింత పెంచాయి. సంప్రదాయాల పరిరక్షణ, సాంస్కృతిక వైభవం చాటి చెప్పేలా బతుకమ్మ సంబురాలు వైభవంగా సాగాయి. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత,మాజీ ఎమ్మెల్యే డి యస్ రెడ్యానాయక్, మాజీ జడ్పీ చైర్మన్లు కుమారి బిందు అంగోత్, తుల ఉమా, గండ్ర జ్యోతి, మంత్రి శ్రీదేవి, పావని గౌడ్, హరిత, రజిత, స్థానిక సర్పంచ్ బాదావత్ లక్ష్మీ రాజు నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తోట లాలయ్య , మాజీ ఎంపీపీ పద్మా రవి, సీనియర్ నాయకులు కురవి మాజీ సర్పంచ్ నూతన్కి పద్మ నరసింహారావు, నాయకులు కొనతం విజయ్, కురవి మాజీ ఉపసర్పంచ్ సంఘం భరత్, బోడ శ్రీను నాయక్, గుగులోతు నెహ్రూ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



- ఆటపాటలతో సందడి చేసిన ఆడపడుచులు
- బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రతిక
- మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్

**చౌటుప్పల్,విశాల భారతి:**

తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను చౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సారథ్యంలో జరిగిన వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. పట్టణంలోని వివిధ వార్డుల నుండి కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు రంగురంగుల బతుకమ్మలను తీసుకురాగా, రామాలయం నుండి గాంధీ పార్క్ వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గాంధీ పార్క్ లో మహిళలందరూ ఒకే చోట చేరి బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.

**చైర్ పర్సన్ పావని ఆకాంక్ష:**

ఈ సందర్భంగా చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, "బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, ఐకమత్యానికి ప్రతీక. ఈ పండుగ సందర్భంగా పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ ను పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక సదుపాయాలతో ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వర నాయక్, కౌన్సిలర్లు కొండనం రాకేష్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఉదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలె శ్రీలత చిరంజీవి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, దేప రమ్య రాజు, పాక చిరంజీవి, భత్తుల వాణి, ఉడుగు జ్యోతి రమేష్, గడ్డం ఇందిరా రాజరత్నం, బత్తుల జయమ్మ దాసు, చింతల ఉమా మహేశ్వరి సాయిలు, బుడ్డ సురేష్, పిల్లలమర్రి మధుసూదన్, హన్సు మహమ్మద్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగారాములు, సందగళ్ల విజయ సతీష్, మహమ్మద్ బాబా షరీఫ్, షేక్ నబీబి జానీ బాబా, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, అధికారులు, మహిళా సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు.



# మరిపెడలో అంగరంగ వైభవంగా ఐదో రోజు బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ ప్రమీల
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ

**మరిపెడ విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** మరిపెడ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు మరిపెడ మండల కేంద్రంలో అంబరాన్నంటాయి. ఐదో రోజు బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళల ఆటపాటలు, సందడితో మరిపెడ కేంద్రం పండుగ శోభను సంతరించుకుంది. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొని, వారితో మమేకమై పండుగ సంబరాలను పంచుకున్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వేడుకలు మహిళల్లో ఆనందోత్సాహాలను నింపాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ వేడుకలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, మరిపెడ మండల అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్, టౌన్ అధ్యక్షుడు రామ్ లాల్, జిల్లా నాయకులు, మరిపెడ మాజీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘు రెడ్డి, జిల్లా యువజన నాయకులు నరసింహారెడ్డి, గుండబోయిన వేణు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సాయినగర్‌లో వైభవంగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, క్యామ మల్లేష్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ సాయినగర్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి, సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, క్యామ మల్లేష్‌లకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఘనస్వాగతం పలికారు. అనంతరం నాయకులు శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

**ఘనంగా నాయకులకు సన్మానం**

విగ్రహ ప్రాణప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన నాయకులను స్థానిక గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

**ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులతో పెద్ద అంబర్‌పేట్ ప్రాంత ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆలయాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిద్ధంకి కృష్ణారెడ్డి, దండెం రామ్ రెడ్డి, ఈదమ్మల బలరాం, పందుగల రాజు,దండెం కృష్ణారెడ్డి, వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి , దండెం రాజశేఖర్ రెడ్డి, పసుల రాజేందర్, కళ్లెం ప్రభాకర్ రెడ్డి, పాలడుగు నాగార్జున,ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కురవిలో దుర్గమ్మ సన్నిధిలో బీఆర్ఎస్ నేతలు



- కురవి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా దుర్గాదేవి మండపం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి
- నేతలకు ఆత్మీయ సత్కారం చేసిన మండప నిర్వాహకులు

**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం ఆధ్యాత్మిక సందడితో అలరించింది. కురవి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని బీఆర్ఎస్ ముఖ్య నేతలు సందర్శించి, దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు, ఆశీర్వచనం అనంతరం నేతలను మండప నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తిభావాన్ని చాటిచెప్పింది. దుర్గాదేవి ఉత్సవాల సందర్భంగా మండపాన్ని సందర్శించిన నాయకులకు నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. భక్తి, ఆధ్యాత్మికత, ఆత్మీయతల సమ్మేళనంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కురవి యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# మెడికవర్.. రేవంత్ బినామీ దవాఖాన

**విశాల భారతి, హైదరాబాద్:** మెడికవర్ హాస్పిటల్.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బినామీ దవాఖాన అని కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆరోపించారు. అక్రమాలకు నిలయంగా మారిన ఆ హాస్పిటల్ వద్ద నిత్యం వందలాది మంది పోలీసులను కాపలా పెట్టారని ఆయన దుయ్యబట్టారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత రాయల కార్తీక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీభవన్ అక్రమాలకు అడ్డాగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు ఆర్ఆర్ ట్యాక్స్ పేరిట ప్రజలను పీడిస్తున్నరు.. మంత్రులు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నరు.. హైడ్రాను బూచిగా చూపి అడ్డగోలుగా దండుకుంటున్నరు' అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైడ్రా పేరిట అక్రమ వసూళ్లు.. మూసీ సుందరీకరణ ముసుగులో భూదందాలు.. రవాణా శాఖలో స్మార్ట్‌కార్డుల స్కామ్.. హౌసింగ్‌బోర్డులో భూముల స్కామ్.. బడిపిల్లల బంకర్‌బెడ్స్ స్కామ్.. ట్రంక్ బాక్సులు, గురుకుల టెండర్లు.. కోడిగుడ్ల టెండర్లు.. ఫోర్త్‌సిటీ.. ఇలా ఏ టూ జడ్ కాంగ్రెస్ ప్రభుత్వం కుంభకోణాలమయమైందని ధ్వజమెత్తారు.

# గుర్తుతెలియని యువకుని దారుణ హత్య

**సంఘటన స్థలాన్ని సందర్శించిన షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ.**



**విశాల భారతి,షాద్ నగర్:** గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు.ఈ సంఘటన కొత్తూరు మండలం తీగపూర్ పంచాయతీ శివారులోని డ్రీమ్ మిడాస్ వెంచర్‌లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తీగాపూర్ శివారులో హత్య జరిగినట్లు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సేకరించారు. అనంతరం ఏసిపి లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని సుమారు 25 ఏళ్ల యువకుడి హత్య జరిగినట్టు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని,రక్తం మడుగులో పడిఉన్న మృతదేహం వద్ద క్లూస్ టీం తో కొన్ని ఆధారాలను సేకరించడం జరిగిందని, పూర్తి విచారణ అనంతరం మృతుని వివరాలు, హత్యకు గల కారణాలను వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్ నగర్ కమ్యూనిటీ అస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.ఏసీపీ లక్ష్మీనారాయణ,వెంట కేశంపేట్ సీఐ శ్రీనివాస్, నందిగామ ఎస్ఐ సుశీల, తదితర సిబ్బంది ఉన్నారు..



## 400 కుటుంబాలకు

# చేయూత

అగ్ర కథానాయిక రష్మిక మందన్న 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ' పేరుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. 400 కుటుంబాలకు నిత్యావసర వస్తువుల ఖర్చును భరించేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంచుకుంది రష్మిక మందన్న. నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్న వీడియోను కూడా షేర్ చేసింది. ఈ ఛారిటీ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల నుంచి 400 కుటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిసింది. 'ఒక్కోవిడత 400 కుటుంబాలకు మూడు నెలల పాటు నిత్యావసర సరుకులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. వచ్చే ఏడాది మొత్తం ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తాను. దీనివల్ల ఆ కుటుంబాలు సరుకుల కోసం చేసే ఖర్చు ఆదా అవుతుంది. ఆ మొత్తాన్ని వారు ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు' అని రష్మిక మందన్న పేర్కొన్నది. సేవా కార్యక్రమాలంటే పెద్ద పెద్ద పనులే చేయాల్సిన అవసరం లేదని, దయాగుణంతో చేసే చిన్న సాయం కూడా ఒకరి జీవితాన్ని మార్చుతుందని, మనందరం ఏదో ఒక చిన్న పనితో ఇతరులను ఆదుకోవాలని రష్మిక మందన్న పిలుపునిచ్చింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.